కన్నీరు కార్చిన శవం

ముదా రమేష్

ఆ రోజు జనవరి 28, 1970.

ఇంగ్లండులోని లివర్‌పూల్ పట్టణం యొక్క సముద్ర తీర ప్రాంతంలో ఆరోజు ఉదయం 8 గంటల వేళ కొందరు జెస్తవాళ్ళకి అచేతనంగా పడి ఉన్న ఒక యువతి కనిపించింది. వాళ్ళు ఆమెను పరీక్షించారు. శరీరం చల్లగా ఉంది. చేతులు, కాళ్ళు కొయ్యబారిపోయాయి. కళ్ళు మూతలు పడిపోయి ఉన్నాయి.

జెస్తవాళ్ళు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసు కార్లు, అంబులెన్స్ వెంటనే వచ్చి చేరాయి. పోలీసు డాక్టర్ ఆ యువతిని పరీక్షించాడు. చనిపోయినట్టుగా ధృవపరచాడు. పోస్ట్ మార్టమ్‌తో పూర్తి వివరాలు అందజేయగలనన్నాడు.

అటెండర్లు ఆమె శవాన్ని స్ట్రెచర్‌మీదకు దేర్చారు. తెల్లటి టెర్పాలిన్ కవరుతో శవాన్ని కప్పి అంబులెన్స్‌లోకి ఎక్కించారు. అంబులెన్స్ హాస్పిటల్ వైపు పరుగులు తీసింది.

డిటెక్టివ్‌లు ఆమె ఎవరా అని పరిశోధన ప్రారంభించారు. ఆమెకు సుమారు 23 ఏళ్ళు ఉంటాయి. ఎర్రని రంగు. సాధారణమైన ఉడుపులు ధరించి ఉంది. పోలీసులపరిశోధనలో ఆమె మిసెస్ డెన్నిస్ బోర్డ్యార్డ్ అని తేలింది. ఆమెకు ముగ్గురు పిల్లలు. భర్త సంవత్సరం క్రితమే చనిపోయాడు. సంసార దారిద్ర్యాన్ని భరించలేక తాను ఆత్మహత్య చేసుకొన్నట్లు వ్రాసి ఉన్న ఒక ఉత్తరం ఆమె గదిలో కనిపించింది. ఒక ఖాళీ విషం సీసా కూడా పోలీసులకు గదిలో దొరికింది. వీటన్నిటి బట్టి పోలీసులు అది ఒక 'ఆత్మహత్య' కేసుగా రికార్డు చేశారు.

'వాటర్‌లూ మార్చ్యరీ' లో పోలీస్ సర్జన్ ఆమె దేహాన్ని పోస్ట్‌మార్టం చేశాడు. కడుపులో విషం ఛాయలు కూడా కనిపించాయి. దానితో రికార్డు పూర్తి అయింది. శవాన్ని హాస్పిటల్ 'గ్యాలరీ'లోకి తరలించేశారు.

ఆరోజు సాయంత్రం 7 గంటల వేళ 'గ్యాలరీ' లోకి అడుగు పెట్టిన ఒకానొక అటెండెంట్ కాకతాళీయంగా డెన్నిస్ శవం వంక చూసి, కెవ్వున కేక వేశాడు. దాని కారణం లేకపోలేదు.

బల్లమీద పడుక బెట్టిన శవం ఏడుస్తోంది! మూతలు పడి ఉన్న రెండు కళ్ళ నుండీ కన్నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి!

అటెండర్ గజగజ వణికి పోయాడు. అయినా తమాయించుకున్నాడు. అతను శవాన్ని చూడటం అది మొదటి సారి కాదు. ప్రతిరోజూ శవాలతో 'గడపడమే' అతని ఉద్యోగం. అదురుతున్న గుండెలను అతను అదుపులోకి తెచ్చుకున్నాడు. వీళ్ళ చుక్కలు పరిగా కళ్ళ క్రింద పడి, కన్నీళ్ళు లాగ కనిపిస్తాయేమో అనుకున్నాడు. జేబులో నుంచి చేతిరుమాలు తీసి, శవం చెక్కిళ్ళను అదిమి కన్నీళ్ళు తుడిచాడు. ఆశ్చర్యం! శవం శరీరంలో



కదలిక లేదు. చల్లగా— మంచుగడ్డలా ఉంది. అయినా కళ్ళలో నుండి కన్నీరు కారడం. ఆగలేదు!

అటెండర్‌కి ఏమీ అర్థం కాలేదు. పెద్ద డాక్టర్ దగ్గరకు పరుగెత్తుకు వెళ్ళాడు. ఎలో నిమిషంలో 'ఏడ్చే శవం' విషయం హాస్పిటల్ అంతా పొక్కి పోయింది. నర్సులు, నౌకర్లు తమ తమ డ్యూటీ ను ఏదిలిపెట్టి 'గ్యాలరీ'కి పరుగెత్తుకు వచ్చారు. స్ట్రెచర్ మీద డెన్నిన్ శవం ఇంకా ఏడుస్తూనే ఉంది.

పెద్ద డాక్టర్ ఎలో నలుగురు వైద్య నిపుణులలో ఆమెను పరీక్షించారు. ఆమె చనిపోయినట్లా లేక బ్రతికినట్లా? వారేదీ నిర్ణయించ లేక పోయారు. లండన్‌లో ఉంటున్న ఆ హాస్పిటల్ సూపరింటెండెంట్‌కి ట్రంక్‌కాల్ ద్వారా ఫోన్‌చేసి ఆ విచిత్రాన్ని గురించి చెప్పి, వెంటనే బయలుదేరి రమ్మన్నారు.

సూపరింటెండెంట్ మరి కొద్దిమంది 'న్యూరో స్పెషలిస్టుల' ను వెంట బెట్టుకొని హడావుడిగా బయలుదేరాడు.

అందరూ కలిసి డెన్నిన్ శరీరాన్ని పరీక్షించారు. ఆ రాత్రి అంతా స్పెషల్ ట్రీట్‌మెంట్‌తో గడిచిపోయింది. మరునాటి ఉదయం 8 గంటలకు డెన్నిన్ సజీవంగా కళ్ళు తెరిచింది.

ఇక ఆ హాస్పిటల్లో సందడి కళ్ళారా చూడవలసిందే. విజిటర్స్ రూమ్ అంతా ప్రెస్ ఫోటో గ్రాఫర్స్, న్యూస్ రిపోర్టర్లతో నిండిపోయింది.

ఆమె ఆత్మహత్య చేసుకోవాలని సముద్ర తీరానికి వచ్చి, అక్కడ విషం తీసుకొంది, ఆ విషయం చాలా భయంకరమైనది. కావలసిన మోతాదు కన్నా ఆమె ఎక్కువగా తీసుకుంది. ఆ ఓవర్‌డోసేజ్ ఆమె శరీరంలో అతి విచిత్రంగా పని చేసింది. స్పృహ కోల్పోయిన ఆమె క్రింద పడిపోయింది. ఆమె పడి ఉన్నది సముద్రతీరంలో. అక్కడి తడి వాతావరణానికి, చలి గాలికి ఆమె శరీరం రియాక్ట్ అయ్యి 'డేష్—ఫ్రిజ్' కండిషన్‌లోకి వచ్చేసింది. కొయ, బారి చల్లగా ఉన్న శరీరాన్ని చూసి ఆమె చనిపోయింది అనుకున్నారు. అందుకే పోస్ట్‌మార్టమ్ కూడా చేయబడింది. దానితో కండరాల్లోని బాధను తట్టుకోలేక ఆమె నిశ్శబ్దంగా ఏడవడం ద్వారా కళ్ళనీళ్ళు రావడం జరిగింది.

ఒక విధంగా చెప్పాలంటే, ఆ కన్నీళ్ళే ఆమెను కాపాడాయి. ఏది ఏమైనా, చనిపోయిన మనిషి మళ్ళీ 24 గంటల తరవాత ప్రాణాలతో తిరిగి రావటం ఈ హాస్పిటల్ చరిత్రలోనే అపూర్వం— అన్నాడు సూపరింటెండెంట్ ఒక ఇంటర్వ్యూలో.

డెన్నిన్ మాత్రం ఏమీ చెప్పలేక పోయింది. విషం తీసుకొని క్రింద పడిపోవటం, మళ్ళీ హఠాత్తుగా హాస్పిటల్ బెడ్ మీద, ఆపరేషన్ అయిన తరవాత కళ్ళు తెరవడం తప్పితే తనకు మరేదీ తెలియదంది.

మరో వారం రోజులవరకు విచిత్రమైన ఆమె కథ "కేస్ ఆఫ్ ది—క్రైయింగ్ కార్పస్"గా అన్ని ప్రపంచ దినపత్రికల్లోనూ ఎంతో సంచలనాన్ని కలిగించింది. *

సాహితీ ప్రపంచం

ఆంగ్ల పదాల వాడుకలో వింతలు

భాషని వాడేటప్పుడు ఎన్నో వింతలు జరుగుతూ ఉంటాయి. తన మనోభావాలు సులభంగా అర్థమవ్వాలనే తపన, వ్యవహర్త యొక్క అలసత, అనవధానత, అలంకారికంగా చెప్పాలనే కోరిక, ఫలోక్తిగా సంభాషించాలనే ఉబలాటం మొదలైన కారణాలే పదాల వాడుకలో వింతలు ఏర్పడటానికి మూలాధారాలు. పూర్వం సంస్కృత భాష ఎంతగా రాజ్యం ఏలిందో ఇప్పుడు ఆంగ్ల భాష అంతగా రాజ్యం ఏలుతూంది. ఆంగ్ల భాషా పదాల్ని వాడటంలో ఏయే వింత లున్నాయో సంగ్రహంగా తెలుసుకుందాం.

వ్యవహర్త అలసత వల్ల పొడుగైన మాటల్ని తుంచేసి 'పొట్టి'గా వాడటం జరుగుతోంది. 'ఫోటో గ్రఫీ'ని 'ఫోటో' అనీ, 'ఎలక్ట్రిక్ కరెంట్'ని 'కరెంటు అనీ, 'బైసికిల్' ని 'బైక్' అనీ అనటం మనకి తెలుసు. ఇలాగే బ్రాసరీకీ బ్రా, టెలిఫోన్‌కి ఫోను, ఎయిరోప్లేన్‌కి 'ప్లేన్', 'గుడ్‌మార్నింగ్' కి మార్నింగ్', 'రిఫ్రిజిరేటర్'కి 'ప్రిజు' 'భెగ్ యువర్ పార్డన్' అనటానికి 'పార్డన్', 'ఆటోమొబైల్' కి 'ఆటో,' 'యూనివర్శిటీకి'కి 'వర్శిటీ', కిలోగ్రామ్‌కి కిలో అనీ అంటున్నాం.

ఒకే పదాన్ని సందర్భాన్ని బట్టి అనేక అర్థాలలో ప్రయోగించవచ్చు. తెలుగులో 'మాట' అనే మాటకి ఈ విధంగా ఇరవై యారు అర్థాలున్నాయి. ఆంగ్లంలోని 'హేండ్' అనే పదాన్ని ఎన్ని అర్థాలలో వాడుతున్నామో ఈ క్రింది ప్రయోగాల్ని బట్టి తెలుసుకోవచ్చు:

1) ఆ సైకిలు ఫస్ట్ హేండ్ కాదు, సెకండ్ హేండ్.

2) పేకాటకి ఒక 'హేండ్' తక్కువయింది.

3) ఈ విషయంలో వాడి 'హాండ్' ఉందనే నా నమ్మకం.

4) వాడు నాకు 'హేండ్' ఇచ్చాడు.

5) షేక్ హేండ్.

ఇలాగే 'హెడ్' పదంకూడా ఆరేడు అర్థాల్లో వాడబడుతోంది.

పూర్వం గౌరవంగా వాడబడే పదం ఇప్పుడు అగౌరవంగా, అసభ్యంగా వాడబడటంకూడా జరుగుతోంది. "తెలిసిన వాడు, నేర్పు గలవాడు" అనే అసలైన అర్థాలతో పూర్వం వాడబడిన 'కన్నింగ్' పదం ఇప్పుడు ఎలా వాడబడుతూందో సుపరిచితమే. 'కన్నింగ్ ఫెలో' అంటే జిత్తులమారి, మోసగాడు' అని కదా నేడు అర్థాలు. పూర్వం తక్కువ కులంలోని వ్యక్తి కార్మికుడు, వ్యవసాయం మొదలైన వాటిల్లో నిపుణుడు అనే అర్థాలు కల విలన్ పదం ఇప్పుడెంత అగౌరవంగా వాడబడుతోంది.

ఒకానొకప్పుడు అగౌరవంగా, నిందా పూర్వకంగా వాడబడిన పదాలు ఇప్పుడు గౌరవంగా సామర్థ్యంతో వాడబడుతున్నాయి. ఉదాహరణకి 'మినిష్టరు' గార్ని తీసుకుందాం. సేవకుడు, రాజుగారి సేవకుడు అని పూర్వార్థం ఇప్పుడీ పదం ఎంత గౌరవార్థంలో వాడబడుతోందో, ఆ పదానికి ఎంత 'వెయిట్' ఉందో, ఎన్నెన్ని పనులు 'ఆపదం'తో చేయించవచ్చో మనందరికీ తెలుసు. 'ప్రజల సేవకుడు' అని చెప్పుకోవటానికి చెప్పుకోవచ్చు, అంతే. అలాగే "గుర్రపుశాలలో చలనం లేకుండా నిలుచునే వ్యక్తి"ని పూర్వం కానిస్టేబుల్' అనేవారు. ఇప్పుడది 'రక్షకభటుడు'గా వాడబడుతోంది.

అక్షరాల్ని 'ఆల్ఫబెట్' అంటాం. కానీ 'ఆల్ఫా, బీటా' అనేవి గ్రీకు వర్ణ సమామ్నాయంలో మొదటి రెండక్షరాలు. వాడికి 'ఏ బీ సీ' లు రావు అని అంటూ ఉంటాం. 'ఏ బీ సీ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్' అనే పుస్తకం వచ్చింది. ఇక్కడ ఎ. బి. సి. అంటే ఆంగ్లాక్షరాలు కాదు—ప్రాథమిక విజ్ఞానం అని అర్థం. ఒకానొక బంతి ఆటలో వాడబడే బాటుని కానీ 'వికెట్' ని కానీ 'క్రికెట్' అనే వాళ్ళు ఇదివరకు. ఇప్పుడది వికెట్లు, బాట్లు, బాలుతో పదకొండు మంది గల రెండు జట్లు ఆడుకునే ఒక 'ఆట'కి పేరుగా వ్యవహరించ బడుతోంది. విద్యార్థులు 'కలర్' అనే మాటని ప్రత్యేకార్థంలో వాడుతుంటారు. "అక్కడ కలర్ లేదురా", "ఇక్కడ సిచ్చ కలర్" అని అన్నప్పుడు 'కలర్'కి 'అమ్మాయిలు' అనే అర్థం. బెంగాల్‌లో విద్యార్థులు వేశ్యకి పర్యాయపదంగా 'టాక్సీ' అని వాడుతూంటారు. 'బాతు గుడ్డు' సున్న ఆకారంలో ఉంటుంది. దీనికి ఆంగ్లంలో 'డక్' అంటూ ఉంటారు. క్రికెట్‌లో ఏమీ స్కోరు చెయ్యని వాడ్ని 'డక్' అంటాం. అలాగే వ్యవహారంలో వెళ్ళిన పని కానప్పుడు 'డక్' అని అనటమూ, పరీక్ష తప్పితే 'డక్కయ్యాడు' అని అనటమూ, సంవత్సరాని కో పిల్లనో పిల్లవాడ్నో కంటూ ఉండే వాడ్ని వీడు 'ఫాస్ట్ బౌలరురా' అని చమత్కరించడమూ అక్కడక్కడ ఉంది. ఎం. సి., ఎల్. డీ. సి, ఏ. ఇ. బి. ఏ, ఎమ్. ఎల్. ఏ. ఇలా సంక్షిప్తంగా అక్షరాలతో వ్యవహరించటం మనకి అలవాటే. ఇలాగే కాలేజీ మాస్టర్లని పొడి అక్షరాలతో పిలుస్తుంటారు. చెప్పిన విషయం వెంటనే అర్థం కాకుండా కొంచెం సేపటికి అర్థం అయితే అటువంటి వ్యక్తిని ట్యూబ్ లైట్ అంటూ ఉంటారు. స్విచ్ వేయగానే కాకుండా వాసేటికి వెలగటం ట్యూబ్ లైటు లక్షణం కదా. మనం ఉత్తరాల్లో రాసే 'డియర్' 'గ్లాడ్ టు సీయు', 'టూకైండ్', 'సిన్సియర్లీ', 'ఫెయిత్‌ఫుర్లీ' మొదలైనవి ఫార్మాలిటీ అయిపోయి అతిశయోక్తులుగా తయారవుతున్నాయి. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఎన్నో వింతలు బయటపడతాయి. ప్రజల నోళ్ళల్లో పడి పదాలు వింత రూపాలతో పాటు వింత అర్థాన్నికూడా సంతరించుకుంటాయి.

- ద్వా. నా. శాస్త్రి